పోలింగ్‌కు పోటెత్తిన ఓటర్లు

- గన్నవరం, పెనమలూరుల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు
- ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన ఓటర్లు
- దొంగ ఓట్లు వేసేందుకు టీడీపీ యత్నం.. ధీటుగా అడ్డుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం


పురుషోత్తపట్నంలో ఓటు వేసిన మహిళలు


రేమల్లెలోని ఎంపీపీ స్కూల్‌లో ఓట్లు వేసేందుకు బారులు తీరిన మహిళలు


తాడిగడపలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల కోలాహలం


నున్న గ్రామం కోటకట్ట సెంటర్ పోలింగ్ కేంద్రం వద్ద వేచి ఉన్న ఓటర్లు


వీరవల్లిలో సాయంత్రం ఆరు గంటలకు క్యూలో వేచి ఉన్న ఓటర్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఓటర్లు వచ్చి, గంటల తరబడి లైన్‌లో వేచి ఉండి, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ, యువకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా ఓటు వేశారు. వృద్ధులు తమ కుటుంబ సభ్యుల సాయంతో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓట్లు వేశారు. రెండు నియోజకవర్గాల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. కొన్ని చోట్ల టీడీపీ నాయకులు రిగ్గింగ్‌కు యత్నించారు. దీంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీటుగా అడ్డుకున్నారు. ఓచుకోలేని టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు.

పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ ప్రలోభాలు

కొత్త మల్లవల్లి, వీరవల్లి, బాపులపాడు, ఆరుగొలను, వేలేరులో స్వల్ప వివాదాలు మినహా మండలంలో 83 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. బాపులపాడు జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ఏజెంట్ డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలింగ్ బూత్‌లో ఎక్కువ సేపు ఉంటూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని శివభరత్‌రెడ్డిపై ఆరోపిస్తూ జనసేన నేత చలమలశెట్టి వివాదానికి దిగారు. తాను అన్ని అనుమతులతోనే పోలింగ్ కేంద్రంలోకి వచ్చానంటూ శివభరత్‌రెడ్డి బదులిచ్చారు. దీంతో పోలీసులు రంగప్రవేశంలో ఇద్దరు నేతలకు సర్దిచెప్పటంతో వాగ్వాదం సర్దుమణిగింది. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఏజెంట్ అనుమతి పత్రాలతో కొత్త మల్లవల్లిలోని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి హడావుడి చేసిన టీడీపీ నేత ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావుపై ఆ గ్రామస్తులు తిరగబడ్డారు. మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు కూడా ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకునే అంశంలో తలెత్తిన వివాదంలో ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు జోక్యం చేసుకోవటంతో పాటుగా, ఆ గ్రామస్తుల ఎదుట తొడగొట్టి సవాల్ విసిరారు. దీంతో ఆగ్రహానికి లోనైన గ్రామస్తులు, ఆయన అనుచరుల మధ్య పరస్పరదాడులు జరిగాయి. ఈ దాడి ఘటనపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆళ్ల ఫిర్యాదు చేశారు. వీరవల్లిలోని ఎంపీపీ స్కూల్ పోలింగ్ బూత్‌లో క్యూ లైనులో నిలబడిన ఓటర్లను టీడీపీ నాయకులు సైకిల్ గుర్తు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తుండంతో వివాదం చోటు చేసుకుంది. దీంతో వైఎస్సార్ సీపీ నేతలు నేరుగా ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు చేయటంతో వెంటనే అక్కడకు అదనపు పోలీసు బలగాలు చేరుకున్నాయి. ఆరుగొలను, వేలేరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను టీడీపీ నేతలు ప్రలోభాలకు గురి చేశారు.


ఎనికేపాడులో ఓటు వేసిన గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ

కట్టుదిట్టమైన భద్రత

విజయవాడరూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకొనేందుకు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. నున్న గ్రామంలోని 13 పోలింగ్ కేంద్రాల్లో 6 గంటల తర్వాత ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన వారందిరికీ పోలింగ్ కేంద్రం సిబ్బంది ప్రత్యేకంగా స్లిప్పులను అందజేసి వారితో ఓట్లు వేయించారు. కోటకట్ట సెంటర్ వద్ద వున్న 7, 8, 9 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. కట్టుదిట్టమైన పోలీసు, స్పెషల్ సీఆర్పీఎఫ్ సిబ్బంది భద్రత నడుమ పోలింగ్ జరిగింది.

గన్నవరం రూరల్‌లో పోలింగ్

గన్నవరంరూరల్: మండలంలోని రూరల్ గ్రామాల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోపవరపుగూడెం, ముస్తాబాద, పురుషోత్తపట్నం తదితర గ్రామాల్లో క్యూలైన్‌లలో వేచి ఉండి ఓటు వేశారు. గోపవరపుగూడెం గ్రామంలో 110 సంవత్సరాల శతాధిక వృద్ధుడు చిట్టినేని వెంకట్రామయ్య పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేశారు. పురుషోత్తపట్నంలో మహిళలు అధిక సంఖ్యలో క్యూలైన్‌లలో వేచి ఉండటం కనిపించింది. ముస్తాబాద జెడ్పీహైస్కూల్‌లో మహిళలు ఓటు వేసేందుకు బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల్లో కోలాహలం నెలకొంది.

గన్నవరంలో 306 పోలింగ్ కేంద్రాలు


గన్నవరంలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

గన్నవరం: గన్నవరం నియోజకవర్గంలో చెదురుమొదురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉదయం అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంల పనితీరుపై మాక్ పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఉదయం 7 గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా 306 పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్ ప్రారంభమైంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉదయం 9 గంటలకు 10 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలు వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్, ఆయన సతీమణి పంకజశ్రీ గన్నవరం జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. 2019 ఎన్నికల్లో 79 శాతం పోలింగ్ నమోదైంది. ఫలితంగా ఉదయం 11 గంటలకు పోలింగ్ శాతం 22.85 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటలకు 38.63 శాతానికి చేరుకుంది. సాయంత్రం 6 గంటలకు 74 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల గడువు ముగిసిన అనంతరం పోలింగ్ కేంద్రం లోపల ఉన్న వారికి మాత్రమే ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. దీంతో అత్యధిక పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు కూడా ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ ప్రక్రియను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ గీతాంజలిశర్మ పర్యవేక్షించారు.

మొరాయించిన ఈవీఎంలు


తాడిగడపలో ఓటు వేసి వస్తున్న వృద్ధుడు

కంకిపాడు/పెనమలూరు/ఉయ్యూరు: చెదురుమొదురు ఘటనలు మినహా సార్వత్రిక సమరం ప్రశాంతంగా ముగిసింది. సాంకేతిక లోపాలతో ఈవీఎంలు తరుచూ మొరాయించటంతో పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. గ్రామాల్లో ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టగా, పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఉదయం సమయంలో ఓటర్లు క్యూలు బారులు తీరినా, పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగానే నడిచింది. పెనమలూరు నియోజకవర్గంలోని 306 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభించారు. నెప్పల్లి, కాసరనేనివారిపాలెం, కంకిపాడు, ప్రొద్దుటూరు, గోసాల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు సాంకేతిక లోపాల కారణంగా తరచూ మొరాయించాయి. సాంకేతిక సమస్య కారణంగా పోలింగ్ ఆలస్యమైంది. గోసాలలోని 161 బూత్‌లో వీవీప్యాట్‌ను మార్చారు.

ఓటెత్తిన ఓటర్లు..

నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలు, ఉయ్యూరు నగర పంచాయతీ, తాడిగడప మున్సిపాలిటీల్లో 2,94,928 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఉదయం 6 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే జనం క్యూ కట్టారు. తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు యువత, వృద్ధులు, మహిళలు గంటల తరబడి క్యూలో నిలబడి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వారు ఓటు హక్కును సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ వీల్‌చైర్స్, సహాయకులను అందుబాటులో ఉంచారు. వారిని క్యూలో నిలబెట్టకుండా ఓటు వేయించి వారికి సహకరించారు. ఓటర్లు ఎండ బారిన పడకుండా ఆయా కేంద్రాల్లో టెంట్లు, తాగునీరు, మజ్జిగ వసతిని సమకూర్చారు. గోసాల, వణుకూరు, పునాదిపాడు తదితర గ్రామాల్లో పోలింగ్ ఇంకా కొనసాగుతోంది.

దొంగ ఓట్లతో టీడీపీ అరాచకం

ఊహించని విధంగా ముస్లింలు, మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవటాన్ని గుర్తించిన టీడీపీ నేతలు అధికారం లక్ష్యంగా బరితెగింపునకు పాల్పడ్డారు. దొంగ ఓట్లు టార్గెట్‌గా పోలింగ్ బూత్‌లలోకి చొరబడి అరాచకం సృష్టించారు. విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారిని గుర్తించి, ఇతర ప్రాంతాల్లోని టీడీపీ కార్యకర్తలను పిలిచించి దొంగ ఓట్లు వేయించారు. ప్రధానంగా పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోరంకి సంవిద విద్యాపీఠ్, తాడిగడప, యనమలకుదురు, ఉప్పలూరు, గొడవర్రు టీడీపీ నేతలు దొంగ ఓట్లు వేయించారు.

గొడవర్రులో వైఎస్సార్ సీపీ నిరసన

గొడవర్రులోని పోలింగ్ కేంద్రంలో టీడీపీ నేతలు దగ్గర ఉండి మరీ దొంగ ఓట్లు వేయించారని తెలియటంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు కాగిత రాజా రమేష్, చుండూరు మోహన్ రావు, సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేకర్, స్థానిక నాయకులు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిరసన తెలిపారు. దొంగ ఓట్లు వేసిన వారిని, అందుకు ప్రోత్సహించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని పోలింగ్ కేంద్రం వద్ద బైఠాయించారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసరావు, సిబ్బందితో గ్రామానికి చేరుకుని నేతలతో చర్చించారు. పోలింగ్ వీడియోలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పి, వైఎస్సార్ సీపీ నేతలకు స్పష్టత ఇవ్వకుండా పోలింగ్ కేంద్రాన్ని ఖాళీ చేయించే ప్రయత్నం చేశారు. దీంతో కొద్దిసేపు గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది.


పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో క్యూ కట్టిన ఓటర్లు


తాడిగడపలో ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్న ఓటర్లు

ఓటు హక్కు వినియోగించుకున్న జోగి..

వైఎస్సార్ సీపీ పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామంలోని విజయ పబ్లిక్ స్కూల్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయనతో పాటు సతీమణి జోగి శకుంతలాదేవి, కుమారులు జోగి రాజీవ్, జోగి రోహిత్, కుమార్తె రేష్మప్రియాంక ఓటు వేశారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లో సినీనటి శ్రీరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.


కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన మంత్రి జోగి

80 శాతం వరకు..

పెనమలూరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో 78.18 శాతం నమోదైంది. 2019 ఎన్నికల్లో పెనమలూరులో 79.89 శాతం పోలింగ్ నమోదైంది. గన్నవరం నియోజకవర్గంలో ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 81.16 శాతం పోలింగ్ నమోదు కాగా, 2019 ఎన్నికల్లో 79 శాతం పోలింగ్ నమోదైంది. గతం కంటే రెండు శాతం పోలింగ్ పెరిగింది.

ఎనికేపాడులో ఉద్రిక్తత


ఆత్కూరులో ఓటు హక్కు వినియోగించుకున్న ఐఏఎస్ అధికారి రాజమౌళి తండ్రి రాంబ్రహ్మం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. రామవరప్పాడులో 19, ప్రసాదంపాడులో 18, నిడమానూరులో 10, ఎనికేపాడులో 10, గూడవల్లిలో 2 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

యార్లగడ్డ అత్యుత్సాహం

ఎనికేపాడు పోలింగ్ బూత్ నెంబరు 69 వద్ద టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేస్తుండడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామంలోని కేవీఆర్ కాలనీకు చెందిన ఓ మహిళ చేత దొంగ ఓటు వేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు ఓటు వేయకుండా అడ్డుకోవడంతో టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకుని ఓవర్ యాక్షన్ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో రెండు వర్గాల మధ్య తోపులాటలు జరిగాయి. పోలీసులు కలగజేసుకుని ఇరు వర్గాలకు సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించేశారు.

అర్ధరాత్రి వరకు ఓటింగ్

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో తేలప్రోలు మినహా అన్ని గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 27 గ్రామ పంచాయతీల 55 పోలింగ్ కేంద్రాల్లో 43,840 మంది ఓటర్లకు ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పలు గ్రామాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఆత్కూరులో ఐఏఎస్ అధికారి రాజమౌళి తండ్రి రాంబ్రహ్మం ఓటు హక్కు వినియోగించుకున్నారు..


ఓటు వేసేందుకు వ్యక్తిని తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు


గన్నవరంలో కొత్తగా ఓటు హక్కును వినియోగించుకున్న యువకుడు


ఈడుపుగల్లులో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు


ఎనికేపాడులో వేచి ఉన్న ఓటర్లు


కేసరపల్లిలో ఓట్లు వేసేందుకు బారులు తీరిన ప్రజలు


నిడమనూరులో ఓటు వేసేందుకు వేచి ఉన్న ఓటర్లు

క్లుప్తంగా

ఓటమి భయంతోనే దాడులు



పెనమలూరు: ఓటమి భయంతోనే టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ తన అనుచరులతో దాడులకు తెగబడ్డాడని పెనమలూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ విమర్శించారు. ఆయన సోమవారం పోరంకిలో మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేని టీడీపీ ఎన్ఆర్ఐ ముసుగులో ఆస్ట్రేలియాలో ఉన్న వ్యక్తి ఓటును దొంగతనంగా వేయాలని చూశారని విమర్శించారు. కొన్ని వందల ఎన్ఆర్ఐ ఓట్లు వేయటానికి ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. ఎన్ఆర్ఐల డబ్బులు పంపిణీ చేశారని పేర్కొన్నారు. పెనమలూరు గడ్డపై వైఎస్సార్ సీపీ ఎగురుతుందని తెలిసి చంద్రబాబు కుట్ర పన్నాడని విమర్శించారు. దొంగ ఓట్లను అడ్డుకున్న చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరేపల్లి రాము, షాహీపై దాడి చేశారని పేర్కొన్నారు. బోడె ప్రసాద్, అనుమోలు ప్రభాకరావు ఈ దాడులు చేయించారని వివరించారు. 'పోరంకి మా అడ్డా.. దొంగ ఓట్లు వేయిస్తాం. ఎవరూ ఆపలేరు' అన్న ధీమాలో వారు ఉన్నారని విమర్శించారు. అక్రమాలను కచ్చితంగా అడ్డుకుంటామని స్పష్టంచేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా దేనికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. దొంగ ఓట్లు అడ్డుకున్నందుకు చేసిన దాడికి బోడె ప్రసాద్‌కు శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారని, రాష్ట్రంలో జగనన్న సీఎం అవుతారు, పెనమలూరులో తాను ఘన విజయం సాధిస్తాను అని జోగి ధీమా వ్యక్తం చేశారు.

కొండలమ్మను దర్శించుకున్న కొడాలి నాని



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సోమవారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ చైర్మన్ శేషం గోపి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను ఒనరించారు. అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి చంటి, శాయన రవి, పెన్నేరు ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఆస్పత్రి నుంచి పోలింగ్ కేంద్రానికి..



పెనమలూరు: అనారోగ్యంతో బాధపడుతూ కూడా భారత పౌరునిగా తన బాధ్యతను నిర్వర్తించేందుకు ఆస్పత్రి నుంచి వైద్యులతో సలహాతో పోలింగ్ కేంద్రానికి వచ్చి తన ఓటును వినియోగించారు. పెనమలూరులో సదరు వ్యక్తి తన ఓటుహక్కును వినియోగించుకుని ఆదర్శంగా నిలిచారు. దీంతో ఆయనను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై యార్లగడ్డ వర్గీయుల దాడి



ఉంగుటూరు: గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, అతని అనుచరులు చేసిన దాడిలో ఓ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన ఉంగుటూరు మండలం తేలప్రోలులో సోమవారం చోటు చేసుకుంది. తేలప్రోలులో జెడ్పీ హైస్కూల్‌లో ఉన్న 271, 273, 274, 275 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు నమోదును పరిశీలనకు టీడీపీ అభ్యర్థి వెంకట్రావు తన అనుచరులతో కార్లలో ర్యాలీగా చేరుకున్నాడు. కొద్ది సేపటికి రోడ్డు పైకి వచ్చిన యార్లగడ్డ వెంకట్రావు, తన అనుచరులు వైఎస్సార్ సీపీ నాయకులను రెచ్చగొట్టే విధంగా వల్లభనేని వంశీమోహన్‌ను, సీఎం జగన్‌ను అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో అక్కడే ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు తమ నాయకులును దూషించడమేంటని నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదనలు తారస్థాయికి చేరడంతో దాడికి పాల్పడ్డారు.

విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ అక్కడకు చేరుకుని ఎన్నికలు సజావుగా జరుగుతున్న తరుణంలో ఈ విధంగా కవ్వింపు చర్యలు ఏంటని ప్రశ్నించారు. ఈ దాడిలో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు విశ్వనాథపల్లి రవికుమార్, ప్రత్తిపాటి జీవన్‌కుమార్, భీమవరపు యతేంద్ర రామకృష్ణ, పలువురు కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న పోలీసులు ఘర్షణ పడుతున్న ఇరువర్గాలను చెదరగొట్టి ఎన్నికలను సజావుగా కొనసాగించారు. గాయపడిన కార్యకర్తలు చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.